క్లుప్తంగా

జడ్జీల బదిలీలు

ఒంగోలు: స్థానిక ఎస్సీ, ఎస్టీ కోర్టు, 7వ అదనపు జిల్లా జడ్జి గా టి. రాజా వెంకటాద్రి నియమితులయ్యారు. ప్రస్తుతం ఈయన మార్కాపురం కోర్టులో 6వ అదనపు జిల్లా జడ్జిగా పనిచేస్తున్నారు. అలాగే ఒంగోలులోని ఎస్సీ, ఎస్టీ కోర్టు, 7వ అదనపు జిల్లా జడ్జిగా పని చేస్తున్న ఆర్. శరత్ బాబును గుంటూరు ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జిగా బదిలీ చేశారు. ఈ మేరకు హై కోర్టు రిజిస్ట్రార్ వై. లక్ష్మణరావు ఉత్తర్వులు జారీ చేశారు.

దట్టంగా కురిసిన పొగ మంచు



మద్దిపాడు వద్ద తెల్లవారు జామున దట్టంగా కురిసిన పొగ మంచు

మద్దిపాడు: మండలంలో మంగళవారం తెల్లవారు జామున దట్టంగా పొగమంచు కురిసింది. పొగమంచు దెబ్బకు రెండు అడుగుల ముందు ఉన్న వాహనాలు కూడా కనిపించలేదు. ఉదయం విపరీతంగా మంచు కురిసి మధ్యాహ్నం నుంచి ఎండ భారీగా పెరిగింది. ఉదయం మంచు, మధ్యాహ్నం ఎండ విపరీతంగా ఉండడంలో మండలంలోని ప్రజలు పలువురు ఉదయమే పనులు ముగించుకుని ఇంటి పట్టున ఉండిపోయారు. ఉదయం జాతీయ రహదారిపై వాహనాలు కూడా చాలా నెమ్మదిగా ప్రయాణించాయి. ఈ పొగ మంచు వలన పొగాకు లేత తోటలకు అనువుగా ఉంటుందని రైతులు పేర్కొన్నారు.

కంచి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతిని కలిసిన వెంకారెడ్డి



శంకర విజయేంద్ర సరస్వతి స్వామిని కలిసిన మారం వెంకారెడ్డి

చీమకుర్తి: కంచి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి స్వామిని మంగళవారం ఒంగోలులో మాజీ ఏఎంసీ చైర్మన్ మారం వెంకారెడ్డి కలిశారు. స్వామి వారి ఆశీర్వాదాలు స్వీకరించారు.

పార్టీ పరిశీలకులతో ఎమ్మెల్యే సమీక్ష



వైఎస్సార్‌సీపీ మండల అబ్జర్వర్స్‌తో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

చీమకుర్తి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల స్థాయి పరిశీలకులతో ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు సమీక్షించారు. మంగళవారం ఒంగోలులోని తన కార్యాయలంలో ఎమ్మెల్యే టీజేఆర్ చీమకుర్తి, సంతనూతలపాడు, మద్దిపాడు, నాగులుప్పలపాడు మండలాలతో పాటు పేర్నమిట్టలోని కార్పొరేషన్ డివిజన్‌ల ప్రతినిధులతో సమీక్షించారు. మా నమ్మకం నువ్వే జగన్, గడప గడపకు మన ప్రభుత్వం, మన ఊరు మన ఎమ్మెల్యే, అంగన్‌వాడీ పోస్టుల నియామకం, గ్రామాల అభివృద్ధి, పార్టీ సంస్థాగత నిర్మాణంపై పరిశీలకులతో సమీక్షించారు.

గృహ నిర్మాణాలు పూర్తి చేయించండి

బల్లికురవ: ప్రభుత్వం నవరత్నాల్లో భాగంగా జగనన్న కాలనీలు, సొంత స్థలాలకు మంజూరు చేసిన పక్కా గృహాలను తక్షణమే పూర్తి చేయించాలని ఎంపీడీవో సీహెచ్ కృష్ణ కోరారు. మంగళవారం స్థానిక పరిషత్ కార్యాలయంలో 20 సచివాలయాల్లోని సెక్రటరీలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు, గృహ నిర్మాణ శాఖ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలానికి 576 ఇళ్లు మంజూరు కాగా ఇంకా 120 ఇళ్ల నిర్మాణాలు నేటికీ చేపట్టకపోవటం పట్ల ఎంపీడీవో అసహనం వ్యక్తం చేశారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ. 1.8 లక్షల నగదు, డీఆర్‌డీఏ ద్వారా రూ. 35 వేలు అందజేస్తున్నామని చెప్పారు. నిర్మాణ పనులు చేపట్టని జగనన్న కాలనీ లబ్ధిదారులు తనకు కేటాయించి ప్లాట్‌ను అప్పగించాలని ఎంపీడీవో కోరారు. ఏఈ దుర్గా రమేష్, ఈవోఆర్డీ జి. సీతామహాలక్ష్మి మాట్లాడారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: శోభకృతు నామ సంవత్సరం, ఉత్తరాయణం చైత్ర మాసం ఉత్తరాభాద్ర నక్షత్రం చతుర్థి తిథి సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర మంగళవారం తెలిపారు. ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, 5.30 గంటలకు బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

ప్రతి ఇంటా సంక్షేమ కాంతులు



కరవదిలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో పాల్గొన్న నేతలు



మడనూరులో జగనన్నే మా భవిష్యత్‌లో పాల్గొన్న నేతలు

ఒంగోలు రూరల్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి ఇంటా సంక్షేమ కాంతులు విరజిమ్ముతున్నాయని నాయకులు పేర్కొన్నారు. మండలంలోని ముక్తినూతలపాడులోని క్రిస్టియన్‌కాలనీ, అంబేడ్కర్ నగర్, గ్రామంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాయపాటి అంకయ్య ఆధ్వర్యంలో ప్రతి గృహాన్ని సందర్శించి సంక్షేమ పథకాల గురించి వివరించారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు నేరుగా ఇంటికే వస్తున్నాయని పేర్కొన్నారు. కరవదిలో ఎంపీటీసీ మన్నె శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి పథకాల గురించి వివరించారు. ప్రజా సంక్షేమమ ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం జగనన్నే మా భవిష్యత్ స్టికర్లను వారి గృహాలపై అంటించారు. కరవది సొసైటీ చైర్మన్ వాకా కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో రెడ్డిపాలెం, తదితర వార్డులను ఆయన గృహాలను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం మొట్ట మొదటిసారిగా కరవది సొసైటీ ద్వారా రైతుల నుండి నేరుగా ధాన్యాన్ని కొనుగోలు చేసే కార్యక్రమాన్ని గత రెండేళ్లుగా కొనసాగిస్తుందన్నారు. మాజీ వైస్ ఎంపీపీ అంచిపోగు రమేష్‌బాబు ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. నవరత్నాల పథకాల ద్వారా పేదల జీవితాల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వెలుగులు నింపారని కొనియాడారు. ముక్తినూతలపాడులో రాయపాటి అంకయ్యతోపాటు వినోద్, పారిశ్రామిక వేత్త వెంకటేశ్వర్లు, కరవదిలో సర్పంచ్ డీ.కోటేశ్వరరావు, కోటి వెంకట్రావు, మన్నేనరేష్, కోటి మల్లేశ్వరి, శ్రీవాణి, అంజిరెడ్డి, హనుమారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, నారాయణ, శ్రీనివాసరెడ్డి, వెంకట్రావు, కోటిరెడ్డి, వలంటీర్ ఉమా పాల్గొన్నారు, మాజీ వైఎస్ ఎంపీపీ అంచిపోగు రమేష్‌బాబు కార్యక్రమంలో కై లా శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, వలంటీర్లు సునందా తదితరులు పాల్గొన్నారు.

కొత్తపట్నం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు చేరాయని వైఎస్సార్ సీపీ మడనూరు గ్రామ అధ్యక్షుడు సామంతుల వీరారెడ్డి అన్నారు. జగనన్నే మా భవిష్యత్, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని మంగళవారం కొత్తపట్నం, మడనూరు, గమళ్లపాలెం పంచాయతీల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఏ మేరకు లబ్ధి చేకూరిందో వివరించారు. మత్స్యకారుల కుటుంబాలకు వెళ్లి మత్స్యకార భరోసా, ఆయిల్ సబ్సిడీ ఎంత వచ్చాయో అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు రోశయ్య, వాయల శ్రీను, వాయల బుజ్జి, గృహ సారథులు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నాగులుప్పలపాడు: అమ్మనబ్రోలులోని ప్రభుత్వ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలలో 5వ తరగతి నుంచి 8వ తరగతి వరకు ప్రవేశాలకు అర్హులైన బాలికల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు అమ్మనబ్రోలు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శైలజ ప్రియదర్శిని తెలిపారు. దరఖాస్తులకు ఏప్రిల్ 24 వరకు గడువు ఉందన్నారు. అభ్యర్థులు 2021–23 విద్యా సంవత్సరంలో మూడు, నాలుగు తరగతులు చదివి ఉండాలని, దీనితో పాటు అభ్యర్థులు ఉమ్మడి ప్రకాశం గ్రామీణ ప్రాంత బాలికలు మాత్రమే అర్హులన్నారు. ఓసీ, బీసీ అభ్యర్థులు 2012 సెప్టెంబర్ 1 నుంచి 2014 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలని తెలిపారు. ఐదో తరగతి లో 80 సీట్లు, 6వ తరగతి బీసీ–ఏ–1, 7వ తరగతి ఎస్సీ బాలికలు–1, 8వ తరగతి బీసీ–బి–1 ఖాళీలు ఉన్నట్లు అభ్యర్థులు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని వీరికి మే 20వ తేదీ ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

పాత వస్తువుల బహిరంగ వేలం

అమ్మనబ్రోలు బాలికల గురుకుల విద్యాలయంలో పాత ఫర్నిచర్, పాత ఇనుప సామానులకు ఈ నెల 26వ తేదీ ఉదయం 11 గంటలకు పాఠశాల ప్రాంగణంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ శైలజ ప్రియదర్శిని తెలిపారు. వివరాలకు 99081 87252 నంబరును సంప్రదించాలన్నారు.

పీజీ సెట్ ద్వారానే ప్రభుత్వ ఫీజు రాయితీలు



మాట్లాడుతున్న ఏకేయూ డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ డాక్టర్ సోమశేఖర్

ఒంగోలు: పీజీ కామన్ ఎంట్రన్స్ టెస్టు ద్వారానే ప్రభుత్వం అందించే ఫీజు రాయితీలు, వివిధ పథకాలను పొందగలరని ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ఆచార్య జి.సోమశేఖర్ అన్నారు. స్థానిక శ్రీహర్షిణీ డిగ్రీ కాలేజీ విద్యార్థులకు మంగళవారం పీజీ కామన్ ఎంట్రన్స్ టెస్టు ప్రాముఖ్యతను వివరించారు. ఆంధ్రకేసరి యూనివర్శిటీ కాలేజీలో ఎంకాం, ఎంఏ ఎకనామిక్స్, ఎంఈడీ, ఎంఏ హిస్టరీ, ఎంబీఏ, ఎంఎస్సీ గణితం, ఎంపీఈడీ, మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్, బీపీఈడీ కోర్సులు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. ఏపీపీజీసెట్ కామన్ ఎంట్రన్స్ టెస్టుకు ఇప్పటికే ప్రకటన వెలువడిందని, మే 11వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. రూ.500 అపరాధ రుసుంతో మే 21వరకు, మే 22వరకు వెయ్యి రూపాయల అపరాధరుసుముతో చెల్లించవచ్చన్నారు. ప్రవేశ పరీక్ష జూన్ 6వ తేదీ నుంచి 10వ తేదీ వరకు రెండు సెషన్స్‌లో ఉంటుందన్నారు. ఉదయం 9.30 గంటల నుంచి 11 గంటల వరకు, మధ్యాహ్నం 1 గంట నుంచి 2.30 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు.ఈ సెట్‌ద్వారా ప్రవేశం పొందిన వారికి ఫీజు రాయితీ, స్కాలర్‌షిప్ లభిస్తుందని, హాస్టల్ ఫెసిలిటీ కూడా ఉందన్నారు. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి పూర్తి వివరాలకు 8341935856 9949088109 నంబర్లను సంప్రదించాలని కోరారు. ఏకేయూ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య జి.రామమోహన్ మాట్లాడుతూ తమ కాలేజీలో అందుబాటులో ఉన్న కోర్సుల వివరాలను తెలియజేసి వాటిలో ప్రవేశాలు పొందడం ద్వారా లభించే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో శ్రీహర్షిణి ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డితో, పీజీ సెంటర్‌నుంచి విచ్చేసిన డాక్టర్ ఎస్.వెంకటేశ్వరరావు, డాక్టర్ సురేష్, డాక్టర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన



ఇనమనమెళ్లూరులో ఉపాధికూలీలు నిర్మిస్తున్న ఫీల్డ్ ఛానల్ పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డితో సర్పంచ్ ఏడుకొండలు

మద్దిపాడు: మండలంలోని ఇనమనమెళ్లూరు గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, గ్రామ సర్పంచ్ ఏకుల ఏడుకొండలు మంగళవారం పరిశీలించారు. ఉపాధి హామీ పనుల్లో భాగంగా ఏర్పాటు చేస్తున్న ఫీల్డ్ ఛానల్‌ను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఉపాధి కావాలని అడిగిన ప్రతి ఒక్కరికీ జాబ్‌కార్డు ఇవ్వాలన్నారు. ప్రస్తుతం వేసవిలో కూలి రేట్లు పెంచారని, నిర్ణీత కొలతల ప్రకారం పని చేస్తే రోజుకు రూ.272 వస్తాయని అన్నారు. ప్రతి ఒక్కరికీ 100 రోజులు పనిదినాలు చూపాలని ఫీల్డ్ అసిస్టెంట్‌లను ఆదేశించారు. కార్యక్రమంలో వారి వెంట జేఈ కిషోర్‌కుమార్, ఎఫ్ ఏ సుసేంద్ర, కూలీలు, మేట్లు పాల్గొన్నారు.

ఉదయం పొగమంచు..మధ్యాహ్నం భానుడి తాపం



ఉదయం 8 గంటల సమయంలో దట్టంగా అలుముకున్న పొగమంచు

ఒంగోలు సబర్బన్: వాతావరణంలో విభిన్నమైన పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. తెల్లవారు జామున, పగటి పూట వాతావరణంలో అనూహ్య మార్పులు చోటుచేసుకుంటున్నాయి. మంగళవారం తెల్లవారుజాము నుంచి దట్టమైన పొగమంచు అలముకుంది. ఒకమాదిరి వర్షంగా ఉదయం ఎనిమిది గంటల వరకు మంచుకురుస్తూనే ఉంది. ఒంగోలు నగరంతో పాటు బయట కూడా ఇదే పరిస్థితి నెలకొంది. అయితే మధ్యాహ్నం సమయానికి భానుడు భగభగమండిపోయాడు. 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

1 నుంచి సమ్మర్ కోచింగ్ క్యాంపులు

ఒంగోలు: జిల్లాలో మే 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు 50 సమ్మర్ కోచింగ్ క్యాంపులు నిర్వహించనున్నట్లు సెట్ప్ సీఈఓ బాబూరావు, చీఫ్ కోచ్ రాజ రాజేశ్వరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 121106840 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

పురాతన కట్టడాలు దేశ సాంస్కృతిక వైభవానికి చిహ్నాలు

- ఏకేయూ డీన్ డాక్టర్ డి.వెంకటేశ్వరరెడ్డి



ఏకేయూ డీన్ డాక్టర్ డి.వెంకటేశ్వరరెడ్డి

ఒంగోలు: మనదేశంలోని ప్రాచీన కట్టడాలు దేశ సాంస్కృతిక వైభవానికి చిహ్నాలు అని, వాటిని కాపాడుకుని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆంధ్ర కేసరి విశ్వవిద్యాలయం డీన్ డాక్టర్ డి.వెంకటేశ్వర రెడ్డి అన్నారు. స్థానిక యూనివర్శిటీ ప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన ప్రపంచ వారసత్వ వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అనేక పురాతన కట్టడాలు ఉన్నాయన్నారు. చందవరం, దూపాడు, భైరవకోన, దేవరంపాడులోని స్థూపం, అనేక దేవాలయాలు, చర్చిలు, మసీదులు ఇలా అనేక కట్టడాలు ఉన్నాయన్నారు. ఒంగోలులోని టంగుటూరి ప్రకాశం పంతులు నివాసమైన ఐలాండ్ విల్లాని పరిరక్షించుకోలేకపోవడం దురదృష్టకరమని మిగిలిన వారసత్వ కట్టడాలను కాపాడుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయానికి చెందిన పలువురు ఆచార్యులు పాల్గొన్నారు.

ఈతముక్కల పాలిటెక్నిక్ కాలేజీలో ఉచిత శిక్షణ

కొత్తపట్నం: మండలంలోని ఈతముక్కల ఎస్‌యు వీఆర్‌ఎస్‌ఆర్ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో పాలిసెట్‌కు సిద్ధమవుతున్న విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు కాలేజీ ప్రిన్సిపాల్ వి.ఏసు ప్రసాదరావు తెలిపారు. ఈ నెల 19 నుంచి ఉదయం 9 గంటల నుంచి 12.30 వరకు తరగతులు నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 8919693460, 8019698620 నంబర్లను సంప్రదించాలని కోరారు.

మంచినీటి సమస్య ఉంటే సమాచారమివ్వండి

- 98499 07314 నంబరుకు సమాచారం అందించండి
- నగర కమిషనర్ వెంకటేశ్వరరావు వెల్లడి

ఒంగోలు సబర్బన్: ఒంగోలు నగరపాలక సంస్థ పరిధిలో మంచినీటి సమస్య ఉంటే వెంటనే కార్యాలయం దృష్టికి తీసుకురావాలని కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు కమిషనర్ మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో వేసవికాలం దృష్ట్యా ఆయా ప్రాంతాల్లో మంచినీటి సరఫరాలో అంతరాయాలు ఏర్పడితే నగరపాలక సంస్థ దృష్టికి తీసుకురావాలన్నారు. సమస్య ఉన్న ప్రాంతాల్లో మంచినీటి ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తామన్నారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలన్నారు. మంచినీటి సమస్య ఉన్న ప్రాంతాల్లోని ప్రజలు నగరపాలక సంస్థ అసిస్టెంట్ ఇంజినీర్ కె.బాలకోటయ్య ఫోన్ నంబర్ 98499 07314కు సమాచారం ఇవ్వాలని కోరారు.

ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ప్రచారభేరి



వాల్‌పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

చీమకుర్తి: కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 30వ తేదీ వరకు సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో ప్రచారభేరీ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు సీపీఎం నాయకులు పమిడి వెంకట్రావు, ఎస్‌కే మాబు తెలిపారు. మంగళవారం చీమకుర్తిలోని సీపీఎం కార్యాలయంలో ప్రచారభేరీకి సంబంధించిన వాల్‌పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఏళ్ల తరబడి ప్రజలు త్యాగాలు చేసి సంపాదించిన స్థాపించుకున్న ప్రభుత్వరంగ సంస్థలను అంబానీ, అదానీలకు కట్టబెట్టడంపై ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. ఈనెల 30న సంతనూతలపాడులో నిర్వహించే బహిరంగ సభను జయప్రదం చేయాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

‘గడప గడపకు’

విజయవంతం చేయాలి



సచివాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తున్న మేయర్, కమిషనర్

- సంక్షేమ పథకాలు అందుతున్న ప్రతి ఒక్కరికీ వివరాలు అందాలి
- ఐదో డివిజన్ వార్డు సచివాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించిన మేయర్, కమిషనర్

ఒంగోలు సబర్బన్: నగరంలోని ఐదో డివిజన్‌లో నిర్వహించనున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత ఆదేశించారు. ఈ మేరకు స్థానిక గోపాల్‌నగర్‌లోని ఐదో డివిజన్‌లోని వార్డు సచివాలయంలో మంగళవారం సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావుతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ గంగాడ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాల ఫలాలు అందరికీ అందేలా చర్యలు చేపట్టాలన్నారు. సంక్షేమ ఫలాలు అందరికీ అందుతున్న వివరాలను లబ్ధిదారులకు డాక్యుమెంట్ రూపంలో అందజేయాలని సూచించారు. ఒంగోలు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ బాలనేని శ్రీనివాస రెడ్డి పాల్గొంటున్న కార్యక్రమంలో ఇంటి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాల వివరాలను తెలియజేయాలని సూచించారు. కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ డివిజన్‌లో పారిశుధ్య పనులు పూర్తి స్థాయిలో చేపట్టాలని అధికారులను ఆదేశించారు. స్థానికంగా ఉన్న సమస్యలను గుర్తించి ఎమ్మెల్యే బాలినేని దృష్టికి తీసుకెళ్లాలని వివరించారు. కార్యక్రమంలో ఒంగోలు ఏఎంసీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు, డివిజన్ కార్పొరేటర్ ఎందేటి పద్మావతి రంగారావు, ఎంఈ కే.మాల్యాద్రి, ఎస్ఎస్ పిచ్చయ్య, డివిజన్ అధ్యక్షుడు సీహెచ్ సత్యనారాయణతో పాటు పలువురు పాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాల్లో సత్తా



వీవీఆర్ డిగ్రీ కాలేజీ విద్యార్థులు



డి.సాయిదుర్గ,



పి.రత్నకుమారి,



బి.మాధవి,



దాసరి మనీషా,

ఒంగోలు: డిగ్రీ మూడో సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో తమ కాలేజీ విద్యార్థులు సత్తా చాటారని సరస్వతి డిగ్రీ కాలేజీ చైర్మన్ ఏవీ రమణారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ ఎంఎస్‌సీఎస్ గ్రూప్‌లో దుద్దు సాయిదుర్గ 389/400, బీఎస్సీ ఎంపీసీఎస్ గ్రూపులో దాసరి మనీషా 380/400, బీసీఏ గ్రూపులో బి.మాధవి 399/450, బీకాంలో పాలకొల్లు ఇంద్రసేనా రెడ్డి 273/350, బీఎస్సీ ఎంపీసీఎస్‌లో పల్లపు రత్నకుమారి 371/400 సాధించారన్నారు. అంతే కాకుండా గణితంలో 75/75 మార్కులు 20 మంది పొందారని, స్టాటిస్టిక్స్‌లో 75కి 75 మార్కులు 10మంది దక్కించుకున్నారన్నారు.

వీవీఆర్ విద్యార్థుల విజయకేతనం..

డిగ్రీ మూడో సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో తమ విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారని వీవీఆర్ డిగ్రీ కాలేజీ చైర్మన్ వడ్లమూడి వెంకట్రావు తెలిపారు. బీకాంలో ఎం.నందిని 290/350, బీఎస్సీలో కె.యోగేశ్వరమ్మ 380/400, బీకాంలో 92శాతం, బీఎస్సీలో 95శాతం ఉత్తీర్ణులైనట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్ వెంకట్రావు అభినందించారు.

పోతురాజు కాలువ పరిసరాలు శుభ్రంగా ఉంచాలి

- పందుల యజమానులకు నోటీసులు జారీ
- పారిశుధ్య పనులను పరిశీలించిన నగర కమిషనర్ వెంకటేశ్వరరావు



మురుగు కాలువను శుభ్రం చేయిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు, సిబ్బంది

ఒంగోలు సబర్బన్: పోతురాజు కాలువ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని శానిటేషన్ అధికారులను, సిబ్బందిని ఒంగోలు నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు ఆదేశించారు. ఈ మేరకు కమిషనర్ మంగళవారం ఒంగోలు నగరంలోని పోతురాజు కాలువ పరిసరాలు, 60 అడుగుల రోడ్డు ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా శానిటేషన్ అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోతురాజు కాలువలో అడ్డుగా ఉన్న ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను దగ్గరుండి తొలగించారు. కాలువ పక్కన డంప్ చేసి ఉన్న చెత్తను జేసీబీ ద్వారా తొలగించారు. తరువాత మదర్‌థెరిస్సా స్కూలు పరిసరాల్లో చేస్తున్న మురుగు కాలువల్లో పూడికతీత పనులను కమిషనర్ పర్యవేక్షించారు. అనంతరం ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి బుధవారం పాల్గొంటున్న ఇఫ్తార్ విందు కార్యక్రమ ప్రాంగణాన్ని పరిశీలించారు.